

తుర్కపల్లి ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్, పక్కన జడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపిక, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు యుగేందర్‌రావు

# అభివృద్ధికి పట్టం కట్టండి

- తొమ్మిదేండ్లలో రూ.3 వేల కోట్లకు పైగా పనులు
- బీఆర్‌ఎస్ తుంగతుర్తి అభ్యర్థి, ఎమ్మెల్యే గాదరి కిశోర్

తుంగతుర్తి, నవంబర్ 1 : గడిచిన తొమ్మిదిన్నరేండ్లలో తుంగతుర్తి నియోజక వర్గంలోని గ్రామ పంచాయతీల్లో రూ.3 వేల కోట్ల పైచిలుకు అభివృద్ధి పనులు చేసినట్లు, అభివృద్ధి ఇలాగే కొనసాగాలంటే బీఆర్‌ఎస్ కారు గుర్తుకు ఓటేసి తనను మరోమారు భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ ప్రజలను కోరారు. బుధవారం మండలంలోని తుర్కపల్లి, గాను గుబండ, కొత్తగూడెం, కర్విరాల, రామన్నగూడెం, సూర్యతండా, మంచితండా, బండరామారం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు నియోజక వర్గంలో 50 వేల మందికి ఆసరా పింఛన్లు, 11 వేల మందికి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ అమలు చేసినట్లు తెలిపారు. రైతుల కోసం రైతు బంధు, రైతు బీమా, రుణ మాఫీ అమలు చేస్తున్నట్లు చెప్పారు. అలాగే తెల్ల రేషన్ కార్డుదారులకు కేసీఆర్ బీమా, రూ.400కే గ్యాస్ సిలిండర్ ఇవ్వనున్నట్లు వివరించారు. కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాయమాటలు ప్రజలు నమ్మవద్దని, నవంబర్ 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపికాయుగేందర్ రావు, ఎంపీపీ గుండగాని కవితారాములుగౌడ్, వైస్ ఎంపీపీ శ్రీశైలంయాదవ్, బీఆర్‌ఎస్ జిల్లా కో-ఆర్డినేటర్ కల్లెట్లపల్లి శోభన్‌బాబు, మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు నల్లు రామ్‌చంద్రారెడ్డి, మార్కెట్ మాజీ చైర్మన్ పులుసు యాదగిరిగౌడ్, పూలమ్మ, ప్రణీతరెడ్డి, కేతిరెడ్డి లతారెడ్డి, చెరుకు పరమేశ్, తడకమళ్ల రవికుమార్, గోపగాని రమేశ్‌గౌడ్, పూర్ణనాయక్, విజ్జినాయక్ పాల్గొన్నారు.

## వర్రె నర్సమ్మకు కంచర్ల రామకృష్ణారెడ్డి నివాళి



నర్సమ్మ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ఆయిల్‌ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి

మోత్కూరు, నవంబర్ 1 : మండలంలోని సదర్శాపురం మాజీ సర్పంచ్ వర్రె భిక్షం సతీమణి నర్సమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతిచెందింది. బుధవారం గ్రామంలో దశ దిన కర్మ నిర్వహించగా ఆయిల్‌ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి హాజరై నర్సమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో సమాచార హక్కు చట్టం ఉమ్మడి రాష్ట్ర మాజీ చీఫ్ సెక్రటరీ వర్రె వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ వర్రె కవితాశ్రీనివాస్, మోత్కూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మేఘారెడ్డి, రైతు బంధు మండల కో ఆర్డినేటర్ సోంమల్లు, బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు దొండ నర్సయ్య పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి

## ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి జన్మదిన వేడుకలు

భూదాన్‌పోచంపల్లి, నవంబర్ 1 : ఎంపీపీ మాదుగుల ప్రభాకర్ రెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం పట్టంలోని బుధవారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన కేక్ చేశారు. ఎమ్మెల్యే ఆయనను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## నేడు అడ్డగూడూరుకు ఎమ్మెల్యే కిశోర్ రాక

అడ్డగూడూరు, నవంబర్ 1 : మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించ నున్నట్లు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కొమ్మిడి ప్రభాకర్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. లక్ష్మీదేవి కాల్వ, ధర్మారం, గోవిందాపురం, మానాయికుంట, గట్టుసింగారం, జానకిపురం, చిన్నపడిశాల, చౌళ్లరామారం గ్రామాల్లో ప్రచారం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

# రేపటి నుంచే నామినేషన్ల స్వీకరణ

- నియోజకవర్గాల వారీగా ఆర్‌ఓ కార్యాలయాల ఏర్పాటు
- ఎక్కడికక్కడే నామినేషన్ల స్వీకరణకు సర్వం సిద్ధం
- ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు
- 10వ తేదీ వరకు కొనసాగనున్న స్వీకరణ
- బీఆర్‌ఎస్ అభ్యర్థుల ఖరారు బీ-ఫామ్‌ల అందజేత
- తర్జన భర్జనల్లో కాంగ్రెస్, బీజేపీ, ఇతర విపక్షాలు

నల్లగొండ ప్రతినిధి, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ): కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు చకచకా ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే పోలింగ్ కేంద్రాల గుర్తింపు, పోలింగ్ అధికారులకు శిక్షణ, ఎన్నికల ప్రత్యేక టీంల నియామకం ఇలా అన్ని రకాల చర్యలు చేపట్టింది. నియోజకవర్గాల వారీగా ఎన్నికల రిటర్నింగ్ అధికారుల నియామకం, కార్యాలయాల ఏర్పాటు ఎప్పుడో పూర్తి చేసింది. జిల్లా ఎన్నికల అధికారులైన కలెక్టర్ల నేతృత్వంలో జిల్లాల వారీగా పకడ్బందీగా చర్యలు చేపట్టింది. ఇక ఎన్నికల్లో కీలకమైన నామినేషన్ల ప్రక్రియ సర్వం సిద్ధమైంది. శుక్రవారం నుంచి అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం మొదలుకానుంది. మధ్యలో ఈ నెల5వ తేదీన ఆదివారం మినహా మిగతా రోజుల్లో 10వ తేదీ వరకు స్వీకరణ కొనసాగనుంది. ప్రతి రోజు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చు. నల్లగొండ నియోజకవర్గానికి సంబంధించి నల్లగొండ ఆర్డీఓ కార్యాలయం, మునుగోడుకు సంబంధించి చండూరులోని ఆర్డీఓ కార్యాలయంలో దేవరకొండకు సంబంధించి అక్కడి ఆర్డీఓ కార్యాలయం, నాగార్జునసాగర్ కు సంబంధించి నిడమనూర్ తాసీల్దార్ కార్యాలయంలో, మిర్యాలగూడకు సంబంధించి స్థానిక ఆర్డీఓ కార్యాలయం, నకిరేకల్‌కు సంబంధించి తాసీల్దార్ కార్యాలయంలో నామినేషన్లను స్వీకరించనున్నారు. సూర్యాపేటలో ఆర్డీఓ కార్యాలయం, తుంగతుర్తిలో తాసీల్దార్ కార్యాలయంలో, కోదాడలో ఆర్డీఓ కార్యాలయంలో, హుజూర్‌నగర్‌కు సంబంధించి స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో నామినేషన్ల ప్రక్రియకు ఏర్పాట్లు పూర్తి చేశారు. భువనగిరిలో ఆర్డీఓ కార్యాలయంలో, ఆలేరుకు సంబంధించి తాసీల్దార్ కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు చేశారు. ఆయా నియోజకవర్గాల వారీగా ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు నామినేషన్ పత్రాలను అందజేయాల్సి ఉంటుంది.

### సీసీ కెమెరాల నిఘాలో..

నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ మొత్తం సీసీ కెమెరాల్లో నిక్షిప్తం కానుంది. ఇందుకోసం ఇప్పటికే ఆర్వో కార్యాలయాల్లో ప్రత్యేకంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. దీంతో పాటు ఆర్వో కార్యాలయంలో అకౌంటింగ్ టీం, వీవీటీ టీం, సీ విజిల్, హెల్ప్‌డెస్క్‌లను కూడా ఏర్పాటు చేశారు.




నల్లగొండ ఆర్డీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎన్నికల రిటర్నింగ్ అధికారి చాంబర్

నామినేషన్ల వివరాలను ఎప్పటికప్పుడు ఎన్‌కోర్ అనే ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో అప్‌డేట్ చేసేలా ఆదేశాలిచ్చారు. నామినేషన్ పత్రాలతో పాటు అభ్యర్థులు సమర్పించే అఫిడవిట్లు, కేసుల పూర్వపరాలు, ఆస్తుల వివరాలను కూడా ఇందులో పొందుపర్చనున్నారు. ఇక నామినేషన్లు దాఖలు చేసే అభ్యర్థులు తమ వాహనాలను, తమ అనుచరులను ఆర్వో కార్యాలయానికి వంద మీటర్ల దూరంలోనే వదిలేసి రావాల్సి ఉంటుంది. ఇక నామినేషన్ దాఖలు చేసే వ్యక్తితో పాటు మరో నలుగురికి ఆర్వో కార్యాల యంలోకి అనుమతి ఉంటుందని ఎన్నికల కమిషన్ స్పష్టం చేసింది. నల్లగొండ జిల్లాలో నామినేషన్ల స్వీకరణకు ఎన్నికల సంఘం నిబంధనల మేరకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ ఆర్.వి.కర్ణన్ తెలిపారు.

### బీఆర్‌ఎస్ దూకుడు.. తర్జనభర్జనల్లో విపక్షం

అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ తనదైన శైలిలో దూకుడు ప్రదర్శిస్తుండగా విపక్షాలు అపసోపాలు పడుతున్నాయి. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఆగస్టు 21వ తేదీనే అభ్యర్థులను ఖరారు చేశారు. ఉమ్మడి జిల్లాలో సిట్టింగ్‌లనే గెలుపు గుర్రాలుగా భావిస్తూ అభ్యర్థులుగా ప్రకటించారు. ఆ వెంటనే బీ-ఫారాలు సైతం అందజేశారు. దీంతో బీఆర్‌ఎస్ ప్రచారంలో దూసుకుపోతుంది. సీఎం కేసీఆర్ కూడా ఇప్పటికే ఎనిమిది నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొని పార్టీలో సమరోత్సాహాన్ని నింపారు. ఇక ఇదే సమయంలో కాంగ్రెస్, బీజేపీలతో పాటు ఇతర పక్షాలు సైతం నేటికీ అన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థులను ఖరారు చేయలేక కొట్టుమిట్టాడుతున్నాయి. కాంగ్రెస్‌లో నేతల మధ్య ఆధిపత్య పోరుతో ఇంకా సూర్యాపేట, తుంగతుర్తి, మిర్యాలగూడ నియోజకవర్గాల్లో అభ్యర్థులను తేల్చలేకపోతుంది. బీజేపీకి బలమైన అభ్యర్థులు లేక మెజార్టీ నియోజకవర్గాల్లో వెతుకులాటలో ఉంది. కానీ రేపటి నుంచి నామినేషన్ల ఘట్టం మొదలుకానుండడంతో ఒకటిరెండు రోజుల్లో తమ అభ్యర్థులను ఫైనల్ చేయక తప్పదు.

## ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ గెలుపునకు కృషి చేయాలి

- రైతు బంధు సమితి జిల్లా కో-ఆర్డినేటర్ ఎస్‌ఏ రజాక్



సమావేశంలో మాట్లాడుతున్న రైతు బంధు సమితి జిల్లా కో-ఆర్డినేటర్ ఎస్‌ఏ రజాక్

మద్దిరాల, నవంబర్ 1 : ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని రైతు బంధు సమితి జిల్లా కో-ఆర్డినేటర్ ఎస్‌ఏ రజాక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో పార్టీ కార్యాలయంలో బూత్ ఇన్‌చార్జీలు, వంద ఓట్ల ఇన్‌చార్జీలతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. బీఆర్‌ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తే ఏం చేస్తుందో ప్రజలకు వివరించాలన్నారు. సమావేశంలో సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు కుందూరు విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా నాయకులు గుడ్ల వెంకన్న, దుగ్యాల రవీందర్ రావు, ఆకుల ఉప్పలయ్యగౌడ్, రావుల వెంకన్న, వద్దాణం మధుసూదన్, మల్లారెడ్డి, చంద్రమౌళి, నర్సయ్య, నాయకులు పాల్గొన్నారు.

## పలువురికి ఓయూ డాక్టరేట్

వలిగొండ, నవంబర్ 1 : మండలంలోని నాగారం గ్రామానికి చెందిన కట్ట శేఖర్ సంస్కృత విభాగంలో ఓయూ డాక్టరేట్ సాధించారు. బుధవారం ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించిన 83వ స్నాతకోత్సవ వేడుకల్లో పద్మశ్రీ శాంతన్ నారాయణ్, వీసీ ప్రొఫెసర్ రవీందర్ ఆయనకు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు.

ఆలేరు : ఆలేరు పట్టణానికి చెందిన తిరునగరి శ్రీనివాస్ ఓయూ డాక్టరేట్ పొందారు. సినారె కవిత్వంలో ప్రయోగాలు- ప్రతీకలు అన్న అంశంపై సమగ్ర అధ్యయనంతో కూడిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది.

భూదాన్‌పోచంపల్లి : పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు పున్న దామోదర్ ఓయూ డాక్టరేట్ సాధించారు. కాకాని చక్రపాణి కథలపై పరిశోధనకు డాక్టరేట్ అందజేసినట్లు ఆయన తెలిపారు.

మోటకొండూర్ : మండల కేంద్రానికి చెందిన కొల్లూరి వెంకటేశ్ ఓయూ డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ఎంప్లాయ్ వెల్ఫేర్ మేనేజ్‌మెంట్ ప్రాక్టీస్ ఇన్ పబ్లిక్ సెక్టార్ అండర్ టేకింగ్స్ ఏ స్టడీ ఆఫ్ ఏపీఎస్ ఆర్టీసీ అనే అంశంపై గ్రంథాన్ని రచించినందుకు గానూ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు.

## మహిళపై దాడి

- తీవ్రగాయాలు

వలిగొండ, నవంబర్1: వ్యవసాయ పనులు చేసుకుంటున్న మహిళపై గుర్తు తెలియని వ్యక్తి దాడి తీవ్రంగా గాయపర్చిన ఘటన మండల పరిధిలోని సంగెం గ్రామంలో బుధవారం జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా మునగాల మండలం ముకుందాపురం గ్రామానికి చెందిన సామినేని నవీన్, నారాయణమ్మ దంపతులు 7 సంవత్సరాల క్రితం వలిగొండ మండలంలోని సంగెం గ్రామంలో ఓ రైతు వద్ద కోళ్ల ఫారం లీజు తీసుకొని నడుపుతున్నారు. దీంతో పాటు పొలాన్ని కౌలుకు తీసుకొని వ్యవసాయ పనులు చేసుకుంటు జీవనం సాగిస్తున్నారు. బుధవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో నారాయణమ్మపై గుర్తు తెలియని వ్యక్తి దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడు. ఆమెను చికిత్స నిమిత్తం చౌటుప్పల్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మెరుగైన చికిత్స కోసం ఉస్మానియా దవాఖానకు తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రభాకర్ తెలిపారు.